


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### సభలూ...సన్మానాలూ!

**సోమిదేవమ్మకి ఓ రోజు** హఠాత్తుగా సన్మానం చేయించుకోవాలని ఆశ పుట్టింది. ఫేస్‌బుక్ అనేది తెరవగానే పండోరా బాక్స్‌లా ఫలానా అమ్మకి 'నాద ప్రపూర్ణ' బిరుదు ఇస్తూ సత్కారం, ఫలానా అయ్యకి 'కవి విరాట్' అవార్డు అని ఊదరగొట్టేస్తుంటే, ఆమెకి చచ్చిపోయిన అత్తగారు గుర్తొచ్చారు.

ఆవిడ ఈ మధ్యే కాలం చేసారు, ఆవిడమీద ప్రేమవల్ల గుర్తు రాలేదు. ఆవిడ పోతూ పోతూ ఇచ్చిన నగలూ, కొంత నగదూ.. అన్నీ ఆమెకి గుర్తొచ్చాయి. బతికున్నంతకాలం "బయటకి రాకూ, గొంతెత్తి పాడకూ, గాడిదలొస్తాయి.. ఒసేవ్ ఏం చేస్తున్నావ్? మళ్ళీ ఆ పనికిరాని పుస్తకాలు చదువుతున్నావా? ఏ రామాయణ భాగవతాలో చదివితే నేనూ వింటాగా?" ఇలా ఆవిడ అస్తమానం తనని సాధించేది.

మొగుడు ఆ అమ్మకి తోడుగా సహ వాద్యాలు వాయించేవాడు. "అమ్మ చెప్పినట్లు వినకపోతే ఆవిడ నగలు నీ తొడికోడలికి ఇచ్చి పోతుంది. మా నాన్న తన రిటయిర్మెంట్ డబ్బులు నేను మాట వినలేదని తన తమ్ముడి కొడుకులకిచ్చి పోయాడు" అని బెదిరించేవాడు.

పెళ్ళయిన మొదటి రాత్రే మొగుడికి మల్లికీ, ఉల్లికీ తేడా తెలీదని మల్లెపూల వాసనకి తెగ తుమ్మి "ఇంకెప్పుడూ పడకగదిలోకి ఇవి రానీకు" అనగానే అర్థమైంది.

పిల్లలు పుట్టారు, పెరిగారు, అత్తగారు సోమిదేవిని వంటింట్లోంచి ఎక్కువగా బయటకి రానీయలేదు. ఆమె సాహిత్యం బొమ్మల రామాయణం, కాశీ మజిలీ కథలుతోనే ఆగిపోయింది. పిల్లలు పెద్దయి పెళ్ళిళ్ళు అయి వెళ్ళిపోయారు. మొగుడు రిటయిర్ అయి, తల్లి పోవడంతో కాస్త నోరు తగ్గించాడు. ఇప్పుడు సోమికి ఫేస్‌బుక్ పరిచయం అయింది. అందులో అందరికీ సన్మానాల ఫోటోలూ, బిరుదులూ, ఇవన్నీ చేయించే ఆకురాతమ్మా పరిచయం అయ్యారు.

ఈ ఆకురాతమ్మ దేనికైనా రాపిడిపెట్టి నిప్పురాజెయ్యగలదు. అందుకే ఆకురాతమ్మ అంటారు. అసలు పేరు ఆశట. అందరినీ "నీలో ఫలానా కళ నివురు గప్పిన నిప్పులా వుంది. దాన్ని బయటకి తియ్యి" అని ప్రేరేపించి, వాళ్ళ చేత పాడించో, పుస్తకాలు రాయించో సన్మానాలు చేయించి, పుస్తకాలు వేసి, ఎంత రాలుస్తారో అంత రాల్చి పుస్తకాలు వేయించి సన్మానం చేయిస్తుంది. దీనివల్ల ఆకురాతమ్మకి సగానికి సగం లాభం. కానీ డబ్బులిచ్చిన సోమిదేవమ్మలకి పోయిన డబ్బు కన్నా జరిగిన సన్మానం, అందులో భజంత్రీల వాళ్ళల్లా రోజూ సన్మానం హాలు కొచ్చి, సదరు సింహాసనం మీద కూర్చున్న వాళ్ళని పొగిడే భజంత్రీరాయళ్ళూ, వాళ్ళు పొగిడిన పొగడ్తలూ, ఫోటోలూ, కప్పిన శాలువాలూ, పేపర్లో ఫోటోలూ.. ఇవి కళ్ళు మిరిమిట్లు గొలుపుతూ, తన ప్రఖ్యాతి వాడవాడలా దేశదేశాలూ పాకుతున్నందుకు కలల్లో తేలిపోతుంటారు.

సోమిదేవమ్మ కొత్తగా వచ్చిన డబ్బుతో ఇది వరకు పాండీబజార్‌లో, వేళ్ళకి ఉంగరాలతో కొత్తగా తెలుగునాటి నుండి వచ్చిన ప్రొడ్యూసర్ కావాలనుకునే బాపతుగా, ఆకురాతమ్మ కంటబడడం వెనువెంటనే సోమిదేవమ్మ ఫేస్‌బుక్‌లో రాసిన 'ఆకాశం ఎందుకో ఎర్రబడింది...సాయంత్రం కాబట్టేమో! బాధపడకమ్మా ప్రతి సాయంత్రానికీ ఒక రాత్రి... ప్రతి రాత్రికీ ఒక ఉదయం వుంటాయి' అని రాసిన కవిత కింద "అద్భుతం...భలే రాసారు. నాకు మీలో ఓ మహా రచయిత్రి కనిపిస్తోంది" అని కామెంటేసింది.

దాంతో సోమిదేవమ్మ రెచ్చిపోయి తవికలనుండి రచనలు మీదకి పోయి 'మాయదారి మొగుడు' అని, పెళ్ళయిన కొత్తల్లో సినిమాకి తీసుకెళ్ళమంటే, మా అమ్మ ఒప్పుకోదు అన్న మొగుడ్ని విలన్‌ని చేసి, సీతామహాసాధ్విలాంటి పెళ్ళాన్ని శోభన్‌బాబు సినిమాకి తీసుకెళ్ళనందుకు, ఆ రాత్రే సతీసక్కుబాయిలా హీరోయిన్ తిరగలిలో పిండి విసురుతూ 'దేవా దీన బాంధవా' అని పాడితే, కళ్ళకి నల్లబట్ట కట్టుకున్న దొంగ వచ్చి, మొగుడి నెత్తి బద్దలు కొట్టి, ఉన్నదంతా దోచుకుపోయిన కథ రాసి, చివరిలో ఇలాంటి మాయదారి మొగుళ్ళకి ఇలాంటి శాస్తి జరగవలసిందే అని రాసింది.

తరతరాలుగా అణిచిపెట్టబడిన స్త్రీల ఆక్రందనలే సోమిదేవమ్మ కలం నుండి జాల్వారే కథలు అని ఆకురాతమ్మ రెచ్చగొడితే, సోమిదేవమ్మ వరసగా 'పనికిరాని మొగుడు ', 'ఆశపోతు అత్త, 'దండగమారి తోడికోడలు', 'సన్నాసి మావ' ఇలాంటి కథలు ఫేస్‌బుక్‌లో పుంఖానుపుంఖాలుగా రాస్తుంటే, కొందరు అన్‌ఫ్రెండ్ చేసారు. కొందరు మనం చదవముగా, ఆమె పాపానికి ఆమే పోతుందిలే అని వదిలేసారు.

కానీ ఆకురాతమ్మ ఓ ఇరవై ఇలాటి పిచ్చి కథలు రాయగానే "పద.. ఇంకా మట్టిలో మాణిక్యంలా ఎన్నాళ్ళుంటావ్? నీకు ఒంటెడు నగలు పెట్టి ఫోటో తీయించి ముఖ చిత్రం వేస్తా! పెద్ద ఫంక్షన్ హాల్‌లో సింహాసనం వేసి, నెత్తికి కుచ్చుల తలపాగా పెట్టి సన్మానం చేయిస్తా! నీ పుస్తకానికి ప్రసిద్ధుల చేత ముందు మాట రాయిస్తా. సిద్ధల చేత బాకా వూదిస్తా. మంత్రులకి అంకితమిప్పిస్తా. మఠాధిపతుల చేత 'ఔరా' అనిపిస్తా. నేను తలుచుకుంటే నిన్ను ఆంధ్ర దేశమంతా మహా

రచయిత్రి అని వేనోళ్ళ ఘోషించేటట్లు చేస్తా. నీకూ రోజులొచ్చాయి.. ఇంకా మట్టిలో మాణిక్యంలాగా, అడవికి కాసె వెన్నెలలాగా ఎందుకుంటావు? రా ... సోమిదేవమ్మ కథలు అని పుస్తకం వేయిద్దాం" అని ఊదరగొట్టింది.

సోమిదేవమ్మ ఊహల్లో తేలిపోయింది. కళ్ళలో మతాబాలు వెలిగించుకుంది. ఆ రవ్వలు రాలుతుంటే అందులో జనం తన ఆటోగ్రాఫ్‌ల కోసం ఎగబడడం, తను పెద్ద పట్టుచీరలో, జడనిండా పూలు పెట్టుకుని, ఒంటెడు నగలతో ఆటోగ్రాఫ్‌లిస్తూ పిల్లల బుగ్గలని నిమరడం "అమ్మా మీ చేత్తో వీరికి అక్షరాభ్యాసం చెయ్యండి. మీ అంతటి మహా రచయిత్రి అవ్వాలని దీవించండి" అని అభిమానులు అర్థించే కలని చూసింది.

కలనుండి ఇల కొచ్చాక "మరి ఆశక్కా ఎంత ఖర్చు అవుతుంది?" అని అడిగింది.

"అబ్బే. ఓ రెండున్నర లక్షల్లో సింపుల్‌గా చేసేద్దాం" అంది ఆకురాతమ్మ.

"సింపుల్‌గానా?" అంది ఆ మొత్తం విని సోమి.

"అయితే నాలుగు లక్షల్లో గ్రాండ్‌గా చేసేద్దాం. చెప్పు చీఫ్ గెస్ట్ సినిమా తారలా? కేబినెట్ మినిస్టర్లా? ఎం.పీలా?" అంది.

"అబ్బే అంతొద్దు. ఫలానా ప్రముఖ రచయితలు.. వాళ్ళు ఓసారి నేను ఆటోగ్రాఫ్ అడిగితే చూడనట్టు పోయారు. ఆ ముగ్గురునీ పట్రా. వాళ్ళ చేత గొంతులు అరిగే దాకా పొగిడించుకుంటా. ఓ పూలదండతో బాటు పట్టు చొక్కాలు, పట్టు చీరలూ పెడదాం" అంది అక్కసుగా సోమి.

"ఇదో పెద్ద కోరికా పిచ్చిదానా? అట్టాగే పొగిడిస్తా. వాళ్ళకి నువ్వు ఏం రాసావో తెలీదు. నేను చదవనిస్తానా? నేను చెప్తాగా అద్భుతంగా రాసావనీ. చచ్చినట్లు పొగుడ్తారు. కానీ పెద్ద పేర్లు చెప్పావు. ఇంకా కొంచెం ఖర్చు ఎక్కువ అవుతుంది" అంది ఆకురాతమ్మ.

నిండా మునిగాకా చలేమీటన్నట్లు సోమిదేవమ్మ "అయితే అయిందిలే డబ్బులు ఉన్నది చేతులు మారడానికేగా" అంది.

"అబ్బ అబ్బా.. నువ్వు సహజ కవివి, ఆశుకవివి. ఏం చెప్పావు ఏం చెప్పావు?" అని పొగిడింది ఆకురాతమ్మ. ఆరోజే సోమి ఎకౌంట్‌లోంచి ఆమె ఎకౌంట్‌లోకి మూడున్నర లక్షలు ప్రవహించాయి, సోమిదేవమ్మ కవిత్వంలాగే. ఇంకేం వుందీ ఏర్పాట్లు జోరుగా సాగాయి ఆకురాతమ్మకి పదివేల పట్టుచీరా, మిగిలిన అమ్మలకీ అయ్యలకీ పట్టు వస్త్రాలూ, మంచి రోజు చూసి అత్తగారు ఇచ్చిపోయిన నగలన్నీ పెట్టుకుని సోమిదేవమ్మ దిగిన రంగురంగుల ఫోటో ముఖచిత్రానికి గాను, ఆ తరువాత ఆమె ఏం రాసిందో చదవకుండానే రాసిన 'మందు'మాటలు అదే ముందుమాటలూ.. పెద్ద హోలూ పూర్ణకుంభం.

"నేను రచయిత్రి కానన్న వాడిని చెప్పుచ్చుకు కొడ్తా. కవిని కానన్న వాడిని కత్తుచ్చుకుని పొడుస్తా" అని సోమిదేవమ్మ ఉపన్యాసంతో, పట్టుచొక్కాల వాళ్ళు గొంతు నొప్పి పుట్టేదాకా పొగుడ్తుంటే, సోమిలో 'అహం' పురివిప్పి నవ్వుకుంది.

ఒకనాడు తను ఈ ఆడిటోరియం వరండాలోనే ఆటోగ్రాఫ్ కోసం వెళితే తనని చూసీ చూడనట్లే హడావిడిగా కారెక్కి వెళ్ళిపోయిన ఆ ప్రముఖులు ఈ రోజు తనేం రాసిందో తన కథల పుస్తకం చదవకుండానే "ఈమె పృధ్వీమీద ఆవిర్భవించిన మహా అద్భుతం.. సాగర మథనంలోంచి పుట్టుకొచ్చిన హాలాహలం తోడబుట్టిన అమృతకలశం" అని పొగిడేసారు.

మరునాడు దినపత్రికల్లో ఆకురాతమ్మ ఇచ్చిన చదివింపులవలన 'ఉత్తమ ప్రముఖ రచయిత్రి సోమిదేవమ్మ పుస్తకావిష్కరణ' అని ఒంటెడు నగలతో సోమీ, అటూ ఇటూ ప్రముఖులు నిలబడి వుండగా, సోమి కాలు మీద కాలు వేసుకుని సింహాసనం మీద కూర్చుని, తలమీద కుచ్చుల పాగా పెట్టుకుని తీయించుకున్న ఫోటోలు ప్రచురించారు.

సోమి అవి పట్టుకుని మురిసిపోయింది. తలమీద పాగా బరువుకి భూమి కనపడడం మానేసింది. ఆమె చెవుల్లో మహారచయిత్రీ.. మహా రచయిత్రీ.. అని చప్పట్లూ, సన్నాయి మోతా మార్మోగుతున్న ధ్వనులు.

"సోమిదేవి వదినా! ఇటు చూడు పుస్తకం వేసేస్తే పత్రికల్లో ఆ ఫోటోలు వచ్చేస్తే చాలా? ఆ పుస్తకం మీద సమీక్షలు చెయ్యాలి. ప్రజలకి వక్తృత్వం పోటీలు పెట్టాలి. ఇంకో లక్షకి చూసుకోవద్దు" అని ఆకురాతమ్మ ఫోన్.

"మళ్ళీ అంత ఖర్చా?" అంది బేలగా సోమి.

"నీ పుస్తకం రీ ప్రింట్‌కి వస్తే, ఆ పాపులారిటీ చూసి జనం కుళ్ళుకు చస్తారు. ఎవరేం చెప్పగలరు? నువ్వు పెట్టిన నాలుగైదు లక్షలకి రేపు ఏ ప్రొడ్యూసరో సినిమా తియ్యడానికో వెబ్ సిరీస్ తియ్యడానికో కొనుక్కుంటే కోటిరూపాయలు డిమాండ్ చెయ్యచ్చు."

సోమిదేవమ్మకి కళ్ళు బైర్లు కమ్మాయి.

"వరెవ ఏమి ఫేసూ.. అచ్చు హీరోల వుంది బాసూ.." అన్న పాట రేడియోలో వస్తోంది.


సోమిదేవమ్మ ఫేన్ మెయిల్‌కి జవాబులిస్తున్నట్లూ, ఆటోగ్రాఫ్‌లిస్తున్నట్లూ కలలు కంటూ మరో లక్ష ఆకురాతమ్మకి ట్రాన్స్‌ఫర్ చేసేసింది. అలా మరో మహారచయిత్రి పుట్టింది.

*(కేవలం హాస్యానికి రాసిన కథానిక. ఎవరినీ ఉద్దేశించి రాసింది కాదు)*










Post your comments